## 99వ అధ్యాయం

# ٩٩ - بَابُ اسْتِحْبَابِ تَقْدِيمِ الْيَمِينِ فِي كُلِّ مَا هُوَ مِنْ بَابِ التَّكْرِيم

# ప్రతి మంచి పనినీ కుడివైపునుండి ఆరంభించటం అభిలషణీయం

كَالْوُضُوءِ وَالْغُسْلِ وَالتَّيَمُّمِ، وَلُبْسِ الثَّوْبِ وَالنَّعْلِ وَالْخُفِّ والسَّرَاوِيلِ وَدُخُولِ الْمَسْجِدِ، وَالسِّوَاكِ، وَالاكْتِحَالِ، وَتَقْلِيمِ الأظْفَارِ، وَقَصِّ الشَّارِبِ وَنَتْفِ الإبْطِ وَحَلْقِ الرَّأْسِ، وَالسَّلاَمِ مِنَ الصَّلاَةِ وَالأَكْلِ وَالشُّرْبِ، وَالْمُصَافَحَةِ وَاسْتِلاَمِ الْحَجَرِ الأَسْوَدِ، وَالْخُرُوجِ مِنَ الْخَلاَءِ، وَالأَخْذِ وَالْعَطَاءِ، وَغَيْرِ ذٰلِكَ مِمَّا هُوَ فِي مَعْنَاهُ. وَيُسْتَحَبُّ تَقْدِيمُ الْيَسَارِ فِي ضِدِّ ذٰلِكَ، كَالاِمْتِخَاطِ وَالْبُصَاقِ عَنِ الْيَسَارِ، وَدُخُولِ الْخَلاَءِ، وَالْخُرُوجِ مِنَ الْمَسْجِدِ، وَخَلْعِ الْخُفِّ وَالنَّعْلِ وَالسَّرَاوِيلِ وَالثَّوْبِ، وَالاِسْتِنْجَاءِ وَفِعْلِ الْمُسْتَقْذَرَاتِ وَأَشْبَاهِ ذٰلِكَ

قال الله تعالى: ﴿فَأَمَّا مَنْ أُوتِيَ كِتَٰبَهُۥ

ఉదాహరణకు వుజూ చేయటం, గుసుల్ చేయటం, తయమ్ముమ్ చేయటం, దుస్తులు, పాదరక్షలు, మేజోళ్ళు, షరాయి ఇత్యాదివి ధరించటం, మస్జిద్‌లోకి ప్రవేశించటం, మిస్వాక్ చేయటం, సుర్మా పూసుకోవటం, గోళ్ళు మీసాలు కత్తిరించుకోవటం, చంకలోని వెంట్రుకలు పెరికివేయటం, శిరోజాలు గొరిగించుకోవటం, నమాజును సలాంతో ముగించటం, తినటం, త్రాగటం, కరచాలనం చేయటం, హజ్రె అస్వద్‌ను (నల్లరాయిని) చుంబించటం, మరుగుదొడ్డి నుండి వెడలటం, ఏదయినా ఇవ్వటం తీసుకోవటం లాంటి పనులన్నీ కుడి వైపు నుండి ప్రారంభించాలి.

వీటికి భిన్నమైన పనులను ఎడమవైపునుండి ప్రారంభించటం అభిలషణీయం. ఉదాహరణకు ముక్కు శుభ్రం చేసుకోవటం, ఎడమ వైపు ఉమ్మివేయటం, మరుగుదొడ్డిలోకి ప్రవేశించటం, మస్జిద్‌నుండి బయటికి రావటం, మేజోళ్ళు, పాదరక్షలు, దుస్తులు ఇత్యాదివి ధరించిన తరువాత వాటిని విడవటం, మూత్రశుద్ధి చేసుకోవటం, అపరిశుభ్రమైన పనులు చేయటం మొదలగునవి.

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు :

తన కర్మల పత్రం తన కుడి చేతికివ్వబడిన

يَمِينِهِ فَيَقُولُ هَاؤُمُ اقْرَءُوا كِتَابِيَهْ ﴾ الآيات [الحاقة: ١٩]، وقال تعالى: ﴿ فَأَصْحَابُ الْمَيْمَنَةِ مَا أَصْحَابُ الْمَيْمَنَةِ ۝ وَأَصْحَابُ الْمَشْأَمَةِ مَا أَصْحَابُ الْمَشْأَمَةِ ﴾ [الواقعة: ٨، ٩].

వ్యక్తి, "చూడండి, నా కర్మల పత్రాన్ని తీసుకొని చదవండి" అని అంటాడు.

*(అల్ హాఖ్ఖహ్ : 19)*

"కుడి పక్షంవారు; కుడి పక్షంవారి (అదృష్టాన్ని) గురించి ఏమనాలి. ఎడమ పక్షంవారు; ఎడమపక్షంవారి (దురదృష్టాన్ని) గురించి ఏమనాలి." *(అల్ వాఖిఅహ్ : 8,9)*

## వివరణ

ప్రళయదినాన దేవుని కరుణాకటాక్షాలకు అర్హులయ్యే దాసులకు వారి కర్మల పత్రాలు కుడిచేతిలో ఇవ్వబడతాయి. ఇది వారి అదృష్టానికి, సౌభాగ్యానికి ప్రతీకగా భావించబడుతుంది. వీరు దైవ సింహాసనానికి కుడిప్రక్కన ఉంటారు కనుక వీరిని "అస్హాబుల్ యమీన్" అని అంటారని మరికొంతమంది పండితులు అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనప్పటికీ గ్రంథకర్త ఇమామ్ నవవీ (రహ్మాలై) పైన పేర్కొనబడిన సూక్తుల ద్వారా మంచిపనుల కోసం కుడివైపు అవయవాలను ఉపయోగించటం మరియు అవాంఛనీయ పనుల కోసం ఎడమ చెయ్యి, ఎడమ కాలు ఉపయోగించటం పుణ్యప్రదమన్న విషయాన్ని నిరూపించారు. హదీసుల్లో కూడా దీని గురించి విశదంగా బోధించటం జరిగింది. మచ్చుకు కొన్ని హదీసులు గమనించండి:

٧٢١ - عن عائشةَ رضيَ الله عنها قالَتْ: كَانَ رسولُ اللهِ ﷺ يُعْجِبُهُ التَّيَمُّنُ فِي شَأْنِهِ كُلِّهِ: في طُهُورِهِ، وَتَرَجُّلِهِ، وتَنَعُّلِهِ. متفقٌ عليه.

721. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లం) ప్రతి పనినీ కుడివైపు నుండి ప్రారంభించటాన్ని ఎక్కువగా యిష్టపడేవారు. చివరికి వుజూ చేసుకోవటం, తల దువ్వుకోవటం, పాద రక్షలు ధరించటమయినా సరే.

*(బుఖారీ - ముస్లిం)*

*(సహీహ్ బుఖారీలోని వుజూ ప్రకరణం, సహీహ్ ముస్లింలోని శుచి, శుభ్రతల ప్రకరణం)*

٧٢٢ - وعنها قالتْ: كانَتْ يَدُ رسولِ اللهِ ﷺ اليُمْنى لِطَهُورِهِ وَطَعامِهِ، وكَانَتِ اليُسْرَى لِخَلائِهِ وَمَا كَانَ مِنْ أَذَى.

722. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) గారే చేసిన కథనం : దైవప్రవక్త (సల్లం) గారి కుడిచేయి వుజూ చేసుకోవటం కోసం, భోజనం చేయటం కోసం ఉప

ندیث صحیح، رواه أبو داود وغيره بإسنادِ صحيحٍ.

యోగపడేది. ఎడమచేయి మలమూత్ర శుద్ధికోసం, ఇతర అపరిశుభ్రమైన పనుల కోసం ఉపయోగపడేది.

(ఈ హదీసు దృఢమైనది, అబూదావూద్ తదితరులు దీనిని దృఢమైన ఆధారాలతో వెలికి తీశారు.)

*(సుననె అబూదావూద్‌లోని శుచి, శుభ్రతల ప్రకరణం)*

٧٢٣ ـ وعن أُم عَطِيَّةَ رضيَ الله عنها أنَّ النبيَّ ﷺ قالَ لَهُنَّ في غَسْلِ ابْنَتِهِ زَيْنَبَ رضي الله عنها: «ابْدَأْنَ بِمَيَامِنِهَا وَمَوَاضِعِ الوُضوءِ مِنهَا» متفقٌ عليه.

723. హజ్రత్ ఉమ్మె అతియ్యా (రజి. అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లం) తన కూతురు జైనబ్ (రజి.అన్హా)కు (ఆమె భౌతిక కాయానికి) స్నానం చేయించే విషయమై మమ్మల్ని ఉద్దేశ్యించి, "స్నానం కుడివైపునుండి మొదలు పెట్టండి; ముందుగా వుజూలో కడగవలసిన అవయవాలు కడగండి" అని అన్నారు. *(బుఖారీ - ముస్లిం)*

*(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలోని జనాయెజ్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

1. మనిషి బ్రతికుండగా తన పనుల్ని కుడివైపునుండి మొదలుపెట్టినట్లుగానే చనిపోయిన తరువాత అతని శవస్నానాన్ని కూడా కుడివైపునుండే మొదలుపెట్టాలి.
2. హజ్రత్ జైనబ్ (రజి.అన్హా) భౌతికకాయానికి స్నానం చేయించిన స్త్రీలలో ఉమ్మె అతియ్యా కూడా ఉన్నారు. శవ స్నానానికి సంబంధించి దైవప్రవక్త (స) వారందరికీ సూచనలిచ్చారు. దీనిద్వారా స్త్రీ భౌతిక కాయానికి అత్యంత దగ్గరి మహ్రమ్ బంధువు అయిన భర్తగాని లేక ఇతర స్త్రీలు గాని స్నానం చేయించాలని బోధపడుతోంది.

٧٢٤ ـ وعن أبي هُريرةَ رضيَ الله عنه أن رسولَ الله ﷺ قال: «إذا انْتَعَلَ أَحَدُكُمْ فَلْيَبْدَأْ باليُمْنى، وَإذَا نَزَعَ فَلْيَبْدَأْ بِالشِّمَالِ. لِتَكُنِ اليُمْنى أَوَّلَهُمَا تُنْعَلُ، وَآخِرَهُمَا تُنْزَعُ» متفقٌ عليه.

724. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రబోధించారు : మీలో ఎవరయినా చెప్పులు తొడుక్కున్నప్పుడు మొదట కుడి కాలికి తొడుక్కోవాలి. విడిచేటప్పుడు మొదట ఎడమ కాలి

చెప్పు విడవాలి. ఇలా తొడుక్కోవటంలో కుడికాలు ఎప్పుడూ ముందుండాలి, వదలడంలో ఎప్పుడూ చివర ఉండాలి. (బుఖారీ - ముస్లిం)

*(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలోని వస్త్ర ధారణ ప్రకరణం)*

٧٢٥ ـ وعن حَفْصَةَ رضيَ الله عنها أنَّ رسولَ اللهِ ﷺ، كان يَجْعَلُ يَمِينَه لِطَعَامِهِ وَشَرَابِهِ وَثِيَابِهِ، وَيَجْعَلُ يَسَارَهُ لِمَا سِوَى ذلكَ. رواه أبو داود والترمذي وغيره.

725. హజ్రత్ హఫ్సా (రజి.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లం) తన కుడి చేతిని తినటం, త్రాగటం కోసం, బట్టలు ధరించటం కోసం ఉపయోగించేవారు. ఎడమ చేతిని వేరే పనుల కోసం ఉపయోగించేవారు.

*(అబూదావూద్, తిర్మిజీ తదితరులు దీనిని ఉల్లేఖించారు)*
*(సుననె అబూ దావూద్‌లోని శుచి, శుభ్రతల ప్రకరణం)*

٧٢٦ ـ وعن أبي هُريرةَ رضي الله عنه أنَّ رسولَ اللهِ ﷺ قال: «إذا لَبِسْتُمْ، وَإذا تَوَضَّأتُمْ، فَابْدَؤُوا بِأَيَامِنكُمْ» حديث صحيح، رواه أبو داود والترمذي بإسناد صحيح.

726. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : మీరు బట్టలు ధరించేటప్పుడు, వుజూ చేసినప్పుడు కుడివైపు నుండి మొదలుపెట్టండి."

*(అబూ దావూద్, తిర్మిజీ, దీని ఆధారాలు దృఢమైనవి)*

*(సుననె అబూ దావూద్‌లోని వస్త్రధారణ ప్రకరణం, సుననె తిర్మిజీలోని వస్త్రధారణ అధ్యాయం)*

٧٢٧ ـ وعن أنسٍ رضي الله عنه أنَّ رسولَ اللهِ ﷺ أتى مِنًى، فَأَتَى الجَمْرَةَ فَرَمَاهَا، ثُمَّ أَتَى مَنْزِلَهُ بِمِنًى، وَنَحَرَ، ثُمَّ قال لِلحلاَّقِ: «خُذْ» وَأَشَارَ إلى جَانِبِهِ الأيْمَنِ، ثُمَّ الأيْسَرِ، ثمَّ جَعَلَ يُعْطِيهِ

727. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం) (తన వీడ్కోలు హజ్‌లో) మినా ప్రదేశానికి చేరుకున్నాక 'జమ్రా' దగ్గరికెళ్ళి దానికి కంకర్రాళ్ళు రువ్వారు. ఆ తరువాత మినాలోని తన విడిది గృహానికి చేరుకొని పశుబలి ఇచ్చారు. తరువాత వెంట్రుకలు గొరిగే మనిషిని పిలిచి ఇటుప్రక్క వెంట్రుకలు గొరగమని చెబుతూ కుడివైపు చూపిం

النَّاسَ. متفقٌ عليه. وفي روايةٍ: لمَّا رَمَى الجَمْرَةَ، وَنَحَرَ نُسُكَهُ وَحَلَقَ، نَاوَلَ الحَلاَّقَ شِقَّهُ الأَيْمَنَ فَحَلَقَهُ، ثم دَعَا أَبَا طَلْحَةَ الأنصَارِيَّ رضي الله عنه، فَأَعطَاهُ إيَّاهُ، ثمَّ نَاوَلَهُ الشِّقَّ الأَيْسَرَ فقال: «احْلِقْ» فَحَلَقَهُ فَأَعْطَاهُ أَبَا طَلْحَةَ فقال: «اقسِمْهُ بَيْنَ النَّاسِ».

చారు. తరువాత ఎడమప్రక్క వెంట్రుకలు గొరిగించుకొని ఆ వెంట్రుకలన్నీ ప్రజలకు ఇవ్వసాగారు.

(బుఖారీ - ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది : దైవప్రవక్త (సల్లం) జమ్రాకు కంకర్రాళ్ళు రువ్వి, పశుబలి ఇచ్చిన తరువాత తల గొరిగించుకోదలచి వెంట్రుకలు గొరిగే మనిషికి తన కుడివైపు శిరోజాలు అందించారు. అతను వాటిని గొరిగేశాడు. అప్పుడాయన అబూ తల్హా (రజి)ని పిలిచి ఆ వెంట్రుకలు ఆయనకిచ్చారు. తరువాత ఎడమ వైపు శిరోజాలు అందిస్తూ "ఇప్పుడు వీటిని గొరుగు" అని అన్నారు. అతను వాటిని కూడా గొరిగేశాడు. దైవప్రవక్త (సల్లం) ఆ వెంట్రుకలు కూడా అబూ తల్హా (రజి)కు ఇచ్చి, వాటిని ప్రజలకు పంచిపెట్టమని ఆదేశించారు.

*(సహీహ్ బుఖారీలోని వుజూ ప్రకరణం, సహీహ్ ముస్లింలోని హజ్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

1. కాబా యాత్రికులు జిల్ హిజ్జా మాసపు పదో తేదీన అరఫాత్ స్థలం నుండి తిరిగొచ్చి 'జమ్రా అఖబా'కు కంకర్రాళ్ళు కొట్టవలసి ఉంటుంది. ఆ తరువాత పశుబలి ఇచ్చి, శిరోజాలు గొరిగించుకోవటంగానీ, కత్తిరించుకోవటం గాని చేస్తారు. చివరగా కాబా గృహం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తారు. ఈ ప్రదక్షిణాలనే 'తవాఫె ఇఫాజా' లేక 'తవాఫె జియారత్' అని అంటారు.
2. తల వెంట్రుకలు గొరిగించుకున్నప్పుడుగాని, కత్తిరించుకున్నప్పుడుగాని కుడివైపు నుండి ప్రారంభించాలి.
3. దైవప్రవక్త గుర్తులను శుభప్రదమైనవిగా భావించటం ధర్మసమ్మతమే. అయితే ఈ పద్ధతి ఒక్క దైవప్రవక్త గుర్తులకు మాత్రమే పరిమితం.